క్లుప్తంగా

ఘనంగా పల్లకీసేవ



విశేషాలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: లక్ష్మీనరసింహస్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. మండలంలోని కలవకొండ గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి తిప్పగుంటపాళెం, కలవకొండ గ్రామాలకు చెందిన యల్లంటి గజేంద్రరెడ్డి, కందల సుధాకర్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బర్డు చైర్మన్ కందల ఆనంద్ పర్యవేక్షించారు.

వేడుకగా శ్రీవారి కల్యాణం



స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణోత్సవం వేడుకగా జరిపారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్య కల్యాణ మండపంలో కొలువు దీర్చి, విశేషాలంకరణ చేశారు. తరువాత వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊజంల్‌సేవ నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోట: మండలంలో ఖాళీగా ఉన్న 3 వలంటీర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ భవానీ శనివారం తెలిపారు. కొక్కుపాడు, నెల్లూరుపల్లె, పుచ్చలపల్లెలో ఒక్కొక్క వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని రెండు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పల్లమాల బీసీ మహిళ, తిమ్మనగారిపాళెంలో ఎస్సీ మహిళకు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22 వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ కొలుపు



గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

రాపూరు: మండలకేంద్రంలోని గంగమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి కొలుపు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. రాత్రి సిద్ధలయ్య ఆలయం నుంచి గంగపెట్టెను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఊరేగింపులో యాదవులు వీరతాళ్లు వేశారు. ఆలయంలో గంగపెట్టెకు ప్రత్యేక పూజలు చేశారు.

బీమా నమోదు రేపు

సూళ్లూరుపేట: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లుకు బీమా వసతి కల్పనకు పేర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల కన్వీనర్లు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్లు, జేసీఎస్ కన్వీనర్లు, 93 సచివాలయాల కన్వీనర్లు, అభిమానులు, సోషల్ మీడియా సైనికులు తప్పకుండా హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత మల్లికార్జున

రాపూరు: పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం చెన్నైకు చెందిన అన్నడి శెట్టి మల్లికార్జున, ఆయన ధర్మపత్ని ప్రవీణ రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని దాతలు ఈఓ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.



యువరైతు **శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి**ది గూడూరు మండలం చెన్నూరు గ్రామం. ఈయనకు 6 ఎకరాలు పొలం ఉంది. గ్రామానికి చెందిన ఐదురుగు రైతులతో కలిసి కమ్యూనిటీ హైరింగ్ గ్రూపు(సీహెచ్‌సీ) ఏర్పడి, ఆర్బీకే ద్వారా రూ.25 లక్షల ఖరీదు చేసే వరికోత యంత్రం కొనుగోలు చేశారు. ఇందులో ఆయనకు రూ.8.80 లక్షలు సబ్సిడీ వచ్చింది. ఆ యంత్రంతో గ్రూపులోని రైతుల పనులు చేసుకోవడంతోపాటు ఇతర రైతులకు అద్దెకు ఇచ్చి, ఆదాయం పొందుతున్నాడు.



గూడూరు మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన **కే జనార్ధనరెడ్డి** సన్నకారు రైతు. ఈయనకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఏటా వరిసాగు చేస్తున్నాడు. దుక్కి దున్నే సమయంలో ఖర్చులు పెరిగిపోతుండడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకే ద్వారా ఐదుగురు రైతులతో కలసి బాలాజీ రైతు గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని రాయితీపై ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఆయన పొలంలో పనులతో పాటు గ్రూపులోని సభ్యులు, ఇతర రైతులకు అద్దెకు పంపుతున్నాడు.

ఆరుగాలం శ్రమించి పంట పండిస్తేనే కర్షకుడి కడుపు చల్లారుతుంది. రైతు వేసే ప్రతి గింజ మొలకెత్తి పది మందికి పట్టెడు అన్నం పెడుతోంది. అలాంటి రైతు బాంధవుడిని సీఎం జగనమోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం 2020 మే 30న రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ఆయన పాలనను మెచ్చుకుని గ్లోబల్ అవార్డును అందజేసింది.



తిప్పవరప్పాడులోని రైతు భరోసా కేంద్రం భవనం

కర్షక నేస్తం

- రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే సేవలు
- సాగులో అన్నదాతలకు సాయం
- విత్తనం నుంచి విక్రయం వరకు భరోసా
- అన్నదాతకు అవసరమైన సేవలన్నీ ఒకేచోట

మండలం: గూడూరు	
రైతు భరోసా కేంద్రాలు: 17	
ఆర్బీకే పరిధిలోని గ్రామాలు: 53	
సేవలు పొందుతున్న రైతులు: 9,643	
పంపిణీ చేసిన ఎరువులు: 2,177 మెట్రిక్ టన్నులు	
విత్తనాలు: వరి విత్తనాలు 2180 క్వింటాళ్లు	
పచ్చిరొట్ట విత్తనాలు: 1751 క్వింటాళ్లు	
రైతు గ్రూపులు: 17	సభ్యులు: 92
పంపిణీ చేసిన ట్రాక్టర్లు: 10	
కల్టివేటర్లు: 55	రోటవేటర్లు: 13
బేలర్లు(గడ్డికట్టే యంత్రాలు): 10	
ప్లవ్: 15	స్ప్రేయర్లు: 64
వరికోత యంత్రం: 1	

గూడూరురూరల్: గూడూరు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలన్నీ సచివాలయ వ్యవసాయ సహాయకుల ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. మల్టీ ఫంక్షనల్ కియోస్కల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసింది. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఆ రిపోర్టుల ఆధారంగా ఏ పంటలు సాగు చేయాలి, వాటికి వాడాల్సిన ఎరువులు, పురుగు మందులు వంటి సూచనలు, సలహాలు ఇస్తోంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు పంట దిగుబడి పెరిగేలా వినూత్న సాగు పద్ధతులపై వ్యవసాయశాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గూడూరు మండలంలో 7,236 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అలాగే 4,200 హెక్టార్లలో ఉద్యాన పంటలైన నిమ్మ, మామిడి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు.



చెన్నూరుకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డికి వరికోత యంత్రాన్ని అందజేస్తున్న అధికారులు

అందుబాటులో సేవలు



ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చాక రైతులకు వ్యవసాయ సేవలు పుష్కలంగా అందుతున్నాయి. పట్టణా లకు వెళ్లే పరిస్థితి తప్పింది. దీంతో సమయం వృథా, ఖర్చులు తగ్గాయి. పంట సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా గ్రామంలోని వ్యవసాయ సహాయకుడిని అడిగి తెలుసుకుంటున్నాం.

–సైదాపల్లి శంకరయ్య, రైతు, పురిటిపాళెం

ఆర్బీకేలతో ఎంతో ప్రయోజనం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. గతంలో గూడూరుకు వెళ్లి, వ్యయప్రయాసల కోర్చి విత్తనాలు, ఎరువులు ఆటోల్లో తీసుకొచ్చేవాళ్లం. ఆర్బీకేలు వచ్చాక గ్రామాల్లోనే మాకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకే దొరుకుతున్నాయి. మాకు చాలా సంతోషంగా ఉంది.

– కలిగిలి శ్రీనివాసులు, రైతు, పాలిచెర్ల

రైతు ముంగిటే సేవలు



ఆర్బీకేల ద్వారా రైతులకు వారి గ్రామంలోనే సేవలు అందిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతోపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయ పరికరాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నాం. మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల ద్వారా రైతులు వాడాల్సిన ఎరువుల మోతాదు వివరాలు తెలియజేస్తున్నాం. సాగుపై మెళకువలను తెలియజేస్తున్నాం.

– రమేష్, వ్యవసాయాధికారి, గూడూరు

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ సీపీని బలోపేతం చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, బాలాయపల్లి, డక్కిలి మండలాల బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్‌ఏ)లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాలు కైవసం చేసుకోవడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఈ మేరకు ప్రతి కార్యకర్త, నాయకుడూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

ఆదర్శవంతం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 19, 20 వార్డుల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఏఏ పథకాల్లో ఎంత లబ్ధి పొందారన్న అంశాన్ని వివరిస్తూ వారి సమస్యలను సావదానంగా వింటూ పరిష్కారం దిశగా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు.

త్యాగమూర్తుల స్మరణలో భాగస్వాములవుదాం

దేశ స్వాతంత్ర్యంకోసం అమరులైన త్యాగమూర్తుల స్మరణలో ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి భాగస్వామ్యులు కావాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని పార్కు వద్ద నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించి, మొక్కలను నాటారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, సీ ఉమామహేశ్వరి, జిల్లా సహాయకార్యదర్శి సీ హరికృష్ణ, వార్డు కౌన్సిలర్ ఎం జానకిరామయ్య, కౌన్సిల ర్లు వహిద, మల్లీశ్వరి, శ్రీనివాసులు, సు బ్బా రావు, డీ రాధ, యస్థానీబాషా, దేవికచౌదరి, జే కామాక్షి, పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు

జాతర వైభవాన్ని విస్తరింపజేద్దాం

వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిన నేపథ్యంలో జాతర వైభవాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం రాజా ప్యాలెస్‌లో ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయచేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇకపై వెంకటగిరిలో జరగబోవు పోలేరమ్మ జాతర వైభవాన్ని రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు సైతం తెలిసేలా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎస్వీబీసీ చైర్మన్ మాట్లాడుతూ పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం వెంకటగిరి ప్రజల అదృష్టమన్నారు.

త్రివర్ణం..సృజనకు ప్రతిరూపం

గూడూరురూరల్: హర్ ఘర్ తిరంగా స్ఫూర్తిని ప్రతిబింబించే సృజన చిత్రాన్ని శనివారం గూడూరు మండలం విందూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, సృజన చిత్రకారుడు కొండూరు వెంకటేశ్వరరాజు రూపొందించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో పెంపొందించేందుకు వాటర్ కలర్స్‌ను ఉపయోగించి జాతీయ చిహ్నాలతో సృజనాత్మకంగా ఈ చిత్రాన్ని చిత్రించినట్లు తెలిపారు.



కలలను సాకారం చేసుకోవాలి

చిల్లకూరు: చిన్నతనంలో కలలు కన్నవారు వాటిని సాకారం చేసుకోవాలని భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పేవారని, విద్యార్థులు అలాంటి వాటిని సాకారానికి యత్నించాలని ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం డాక్టర్ విక్రమ్ సారాబాయ్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవుని మేధస్సులో ఎన్నో ఆలోచనలు వస్తుంటాయని, వాటిని సాకారం చేసుకునేందుకు ప్రయత్నిస్తే సాధించవచ్చన్నారు. అనంతరం శాస్త్రవేత్తను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థులు

సంక్షేమంతో సంతోషం

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాగణం పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు, నాయకులు ఆయనకు అడుగు అడుగునీ నీరాజనాలు పలికారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎం రవికుమార్ యాదవ్, బీ రాజారెడ్డి, వేణురెడ్డి, కే చంద్రరెడ్డి, జీ చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ ఈ పెంచలయ్య విజయరాఘవరెడ్డి, చిరంజీవి ,వెంకటేశ్వర్లు, గంగయ్య యాదవ్ బలరామయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

చిల్లకూరు: పోక్సోకేసులో ఓ యువకుడిని శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని మోమిడికి చెందిన నాసిన గోపి అనే యువకుడు నమ్మించి మోసం చేయడంతోపాటు ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 5వ తేదీన పోక్సో నమోదు చేశారు. ఈ మేరకు గోపిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా నిందితుడికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

మహాసభను విజయవంతం చేయండి

దొరవారిసత్రం: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు పిలుపునిచ్చారు. మహాసభకు జన సమీకరణలో భాగంగా స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మండలంలోని ఏకొల్లు, వేణుంబాకం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో గోవిందువాసు, పెంచలయ్య, నాగేశ్వరావు, సునీల్, రవి పాల్గొన్నారు.

వైభవం.. కన్యకాపరమేశ్వరి రజతోత్సవం



వాసవీ కన్యకాపరమేశ్వరి పూజల్లో పాల్గొన్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి రజతోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి వేప పండితులు అధ్వర్యంలో గణపతి పూజ, రక్షాబంధన్, ఆఖండ దీపారాధన, వేదపారాయణం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం తదితర పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు. అమ్మవారికి బంగారు చీరను అలంకరించి, విశేష పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి దేవస్థానం నిర్మాణంతోపాటు అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను సన్మానించారు.



బంగారుచీరలో కన్యాకపరమేశ్వరి



పల్లకీసేవలో భక్తుల కోలాట ప్రదర్శన

కరుణించమ్మా..మాతమ్మ

వెంకటగిరిరూరల్: కరుణించమ్మా.. మాతమ్మ.. మాయమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. బాలాయపల్లి మండలంలోని కడగంట అరుంధతీయవాడలో మాతమ్మ కొలుపు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొలుపులో భాగంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మ బుర్రకథ, జానపద నృత్యాలు భక్తులను అలరించాయి. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు దేవికచౌదరి మాతమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



మాతమ్మకు మొక్కుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకురాలు

వేధింపులపై కేసు నమోదు

నాయుడుపేటటౌన్: భర్త తరచూ చిత్రహింసలకు గురిచేస్తూ, మానసికంగా వేధిస్తున్నట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండల కొత్తూరు గ్రామానికి చెందిన సీ అశోక్‌కుమార్‌కు బాలయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన వైష్ణవితో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అశోక్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ నాయుడుపేటలోని పాగొట్టం కాలనీలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా అశోక్‌కుమార్ భార్య వైష్ణవిని చిత్రహింసలు గురి చేస్తున్నా డు. ఈ విషయమై బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశ ప్రగతిని చాటేందుకే నా భూమి- నాదేశం



చిల్లకూరు: మొక్క నాటుతున్న ఎస్‌ఐ, సర్పంచ్



చిల్లకూరు: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జనార్దనరెడ్డి



నాయుడుపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

చిల్లకూరు: భారతదేశం సాధిస్తున్న ప్రగతిని చాటేందుకే ప్రభుత్వం నా భూమి– నాదేశం అనే కార్యక్రమం చేపట్టి, ప్రతి పంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి, వైఎస్సార్ జలకళ అడిషనల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉడతావారిపాళెంలో శనివారం నా భూమి– నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, శిలాఫలకం ఆవిష్కరించి, జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతితోపాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరికీ తెలియజేసి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాదేవి, సర్పంచ్ పీ విజయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ చంద్రారెడ్డి, ఉపాధి ఏపీఓ గిరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నల్లారెడ్డి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే వాతావరణంలో మార్పులు

పచ్చదనం పెంపొందితేనే వాతావరణంలో మార్పులు సాధించగలమని చిల్లకూరు ఎస్‌ఐ గోపాల్ అన్నారు. మండలంలోని కమ్మవారిపాళెం పంచాయతీలోని గుత్తావారిపాళెంలో శనివారం సర్పంచ్ సీ నారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మొక్క లు నాటారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నేడు పట్టణాలు విస్తరిస్తున్న క్రమంలో చెట్లడవులను పూర్తిగా తొలగించాల్సి వస్తుందని, దీంతో వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుని కాలుష్యం బారిన పడుతున్నామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భావితరాల వారికి మంచి వాతావరణం ఇవ్వడంతో పాటుగా స్వచ్ఛమైన గాలిని అందించిన వారమవుతామ న్నారు. అనంతరం పలు పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

నాయుడుపేట: గ్రామాల్లో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని అధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని తన్నమాలలో శనివారం నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 100 మొక్కలు పైగా నాటారు. అనంతరం గ్రామ ప్రజలతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధి హామీ పథకం అధికారులు, నాయకుడు ఎన్ రమణయ్య పాల్గొన్నారు.